క్లుప్తంగా

యూరియా కోసం నిరీక్షణ



యూరియా స్లిప్‌ల కోసం నిరీక్షిస్తున్న రైతులు

నందిగాం: ప్రభుత్వ తీరుతో యూరియా కోసం అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని నందిగాం, కాపు తెంబూరు, పెద్ద తామరాపల్లి తదితర గ్రామాల్లో గురువారం యూరియా పంపిణీకి వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు. దీంతో ఆయా గ్రామాల వద్ద రైతులు తమ ఆధార్‌కార్డులు, పాస్‌బుక్‌లతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని గంగాధరపేట గ్రామంలో నారీశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. గంజాయి అక్రమ రవాణా, సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఏటీఎం మోసాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

ఇచ్ఛాపురం రూరల్: మేజర్ పంచాయతీ ఈదుపురం బెహరా వీధిలో పారిశుద్ధ్యం క్షీణించడంతో స్థానికులు జ్వరాల బారినపడుతున్నారని కండ్రావార్డు యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్యదర్శి విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించినవారిలో హంగీర్ బెహరా, పాల్ బెహరా, జిత్ ఉమాకాంత్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



లబ్ధిదారులకు పోషకాహారం అందజేస్తున్న ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలు పురస్కరించుకొని కె.శాసనాం అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు గుడ్లు, పాలు, బాలామృతం సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తప్పకుండా పౌష్టికాహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, హెచ్‌ఎం కె.సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

మందస: మండలంలోని మకరజోల, సొండిపూడి, కొత్తపల్లి ఉన్నత పాఠశాలలను వమరవల్లి డైట్ అధ్యాపకురాలు జి.ఇందువదన గురువారం సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, టీచర్ హ్యాండ్ బుక్, విద్యార్థుల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమవేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

పలాస: విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎఫ్, జీపీఎఫ్ సాధన సమితి ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం భోజన విరామ సమయంలో నల్లబాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.అప్పికొండ, శేఖర్, వి.ధనరాజు, సీహెచ్ శ్రీధర్, తేజేశ్వరరావు, భాస్కరరావు తదితరలు పాల్గొన్నారు.

మహిళా భద్రతకే 'నారీ శక్తి'

ఇచ్ఛాపురం రూరల్: మహిళల భద్రతకే నారీశక్తి యాప్ రూపొందించారని రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాయితారీ, కీర్తిపురం గ్రామ పంచాయతీల్లో మహిళలు, యువకులతో గురువారం సమావేశమయ్యారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించరాదని, అపరిచిత వ్యక్తులతో వెళ్లరాదని, అత్యవసర పరిస్థితుల్లో తమకు సమాచారం అందించాలని సూచించారు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

టెక్కలి: గ్రంథాలయంలో పాఠకులకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీవీజీఎస్ శంకరరావు పేర్కొన్నారు. గురువారం టెక్కలి శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పంచాయతీ నుంచి రావాల్సిన సెస్ నిధులు వచ్చే విధంగా చూడాలని వెల్లడించారు. గ్రంథాలయాధికారి రూపావతి ఉన్నారు.

ప్రభుత్వ భవనాలిలా.. పట్టించుకోకుంటే ఎలా..?



తుప్పల మధ్యలో ఉన్న వెలుగు కార్యాలయం

- శిథిలావస్థకు చేరుకుంటున్న భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ఇచ్ఛాపురం రూరల్:

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఫలితంగా రోజులు గడిచే కొద్దీ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని అన్యాక్రాంతానికి గురవుతున్నా.. అధికారులు తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

తుప్పల్లో 'వెలుగు' భవనం

ఎంపీడీవో కార్యాలయం ప్రాంతంలో 2000వ సంవత్సరంలో ఉపాధి నిధులు సుమారు రూ.32 లక్షలతో వెలుగు భవనాన్ని నిర్మించారు. అయితే తర్వాత ఉపాధి, వెలుగు కార్యాలయాల కోసం అదనంగా మరో భవనం నిర్మించడంతో వెలుగు సిబ్బంది నూతన భవనంలోకి వెళ్లిపోయారు. ఫలితంగా గత పన్నేండేళ్ల నుంచి వెలుగు భవనం ముళ్ల పొదల్లో నిరుపయోగంగా ఉంది. ఈ భవనంలో వ్యవసాయ కార్యాలయం నిర్వహించేందుకు సంబంధిత అధికారులు కోరినప్పటికీ, ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లభించకపోవడంతో ప్రస్తుతం ఖాళీగానే ఉంది.

అధ్వానంగా ఐసీడీఎస్ భవనం

స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి అంగన్‌వాడీ సిబ్బంది కార్యకలాపాలకు 2017లో చెరో రూ.53 లక్షలు వెచ్చించి ఇచ్ఛాపురం రూరల్, అర్బన్ ఐసీడీఎస్ కేంద్రాలను నిర్మించారు. నూతన నిబంధనల ప్రకారం రూరల్ ఐసీడీఎస్ కేంద్రంలోకి అర్బన్ కేంద్రం అనుసంధానం చేయడంతో అర్బన్ ఐసీడీఎస్ భవనం ప్రారంభానికి సైతం నోచుకోలేదు. దీంతో



ప్రారంభానికి నోచుకోని అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం

గత ఎనిమిదేళ్ల నుంచి ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. రూ.లక్షల విలువైన నూతన భవనం అక్కరకు రాకుండా పోవడంతో పాటు అధ్వానంగా మారి శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్రస్తుతం ఈ భవనం తాళాలు ఇతరుల వద్ద ఉన్నట్లు సమాచారం.

దిష్టిబొమ్మల్లా వసతి గృహాలు



ముళ్ల పొదల మధ్య ఎస్సీ బాలుర వసతి గృహం

స్థానిక ఎంపీడీవో కార్యాలయం పక్కన 1977 సెప్టెంబర్‌లో బాలికల కోసం సుమారు రూ.25 లక్షలు వెచ్చించి ప్రభుత్వ బాలికల వసతి గృహం నిర్మించారు. ఈ వసతి గృహం అప్పటి ఐఏఎస్ అధికారి, ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.ఆర్.శంకరన్ చేతులమీదుగా ప్రారంభించబడింది. అదేవిధంగా స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వెనుక రూ.36 లక్షలతో ఎస్సీ బాలుర వసతి గృహాలు నిర్మించారు. పేద విద్యార్థులతో కళకళలాడే ఈ రెండు వసతి గృహాలను 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో నాటి నుంచి నేటికి పదకొండు ఏళ్లుగా ఈ రెండు భవనాలు పరాయివారి చేతుల్లోకి వెళ్లిపోయాయి. రెండంతస్తుల బాలికల వసతి గృహంలో పైభాగం మందు బాబులకు విడిది కాగా, దిగువ భాగం ఇనుము, ప్లాస్టిక్, పనికిరాని స్క్రాప్ దాచుకోవడానికి నిలయంగా మారిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ వసతి గృహంలో 'సమీకృత వ్యవసాయ ప్రయోగశాల'ను ఏర్పాటు చేసేందుకు అప్పట్లో సంబంధిత అధికారులు ప్రయత్నించినా.. సాంఘిక సంక్షేమ శాఖ అనుమతులు మంజూరు చేయకపోవడంతో వ్యవసాయ అధికారులు సోంపేటలో నూతన భవనం నిర్మించుకున్నారు. అదేవిధంగా ఎస్సీ బాలుర వసతి గృహం భవనాలు ముళ్ల పొదలు మాటున శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒకవైపు ఈ ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉండగా.. మరోవైపు వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలు శిథిల భవనాలు, అద్దె భవనాల్లో కొనసాగుతుండడం గమనార్హం. ఈ భవనాలు వినియోగంలోకి తీసుకు రావాలంటే జెడ్పీ సీఈవో, ఐసీడీఎస్ పీడీ, సాంఘిక సంక్షేమ శాఖాధికారుల అనుమతులు ఉండాలని ఎంపీడీవో కె.రామారావు అభిప్రాయపడుతున్నారు.



బాలికల వసతి గృహంలో మద్యం బాటిళ్లు

ప్రత్యామ్నాయాలకు వినియోగించాలి



ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఆ భవనాలను అలా వదిలేయకుండా ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. భవనాలు అలాగే వదిలేయడం వలన చాలా వరకు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ శాఖల సమన్వయంతో వేరే శాఖలకు అవసరమైన వాటిని వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పి.రాజశేఖరరెడ్డి, సర్పంచ్, ఇచ్ఛాపురం మండలం

బకాయిలు చెల్లించాలి

టెక్కలి రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొండు నారాయణరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల సేకరణలో భాగంగా కోటబొమ్మాళి మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని, పీఆర్సీ ప్రకటించాలని, డీఏ బకాయిలని చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అలాగే హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులందరికీ జాప్యం లేకుండా వైద్యం అందివ్వాలని, పెన్షనర్ల బకాయిలను చెల్లించాలని, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సెలవులకు నగదు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, మన్మథరావు, తవిటమ్మ, నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

146 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 146 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డా.నీలిమ, వైద్య సిబ్బంది డా.దేవేంద్రరెడ్డి, డా.అనూష, డా.శిల్ప, మానసిక వైద్య నిపుణురాలు డా.నిర్మల అలెగ్జాండర్, డా.ఎస్.శ్రీకాంత్, డా.రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాస: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు బోనెల గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పలాస మండల స్థాయి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఎన్జీవోల సంఘం కార్యదర్శి బి.ఉపేంద్రరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉద్దానం రామకృష్ణాపురం సర్పంచ్ చింత హేమారావు అన్నారు. గురువారం ఉద్దానం రామకృష్ణాపురం నుంచి అమలపాడు, పాతటెక్కలి వరకు 5 కిలోమీటర్ల మేర జేసీబీ వాహనంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి పిచ్చిమొక్కలు తొలగించారు. పెద్ద ఎత్తున పొదలు పెరిగిపోవడంతో మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

వజ్రపుకొత్తూరు రూరల్: పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్.గణపతి అన్నారు. వజ్రపుకొత్తూరులో 6వ సీఐటీయూ మండల మహాసభ సీఐటీయూ కో-కన్వీనర్ ఎం.మంజులాకుమారి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక వ్యతిరేక చర్యలపై కార్మికులు, ఉద్యోగులు కలిసి సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు కార్మికులకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని మండిపడ్డారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు మంజూరు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ఆటో కార్మికులకు రూ.25 వేలు అందించాలన్నారు.



ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అదేవిధంగా పాడైపోయిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.మోహన్‌రావు, ప్రజా సంఘ నాయకులు చంద్రయ్య, చామంతి, రాజు, తిరుపతి, నిర్మల, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఆర్‌వోబీ పనులు

పలాస: కాశీబుగ్గ రైల్వే ఎల్‌సీ గేటు వద్ద ప్రభుత్వం చేపడుతున్న రైల్వే ఫ్లై ఓవరు బ్రిడ్జి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. నిర్వాసితులు దగ్గర తీసుకున్న ఇళ్లు, షాపులను తొలగించే కార్యక్రమం చేపడుతున్నారు. గత ప్రభుత్వంలో నిర్వాసితుల సమస్యను పరిష్కరించారు. మొత్తం 122 మంది నిర్వాసితులకు గాను, 90 మందిని అర్హులుగా గుర్తించి నష్టపరిహారంతో పాటు ఇళ్ల స్థలాలను కూడా ఇప్పించారు. అంతలోనే ఎన్నికలు రావడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పనులు జరుగుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి మొత్తం రూ.48 కోట్లు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పుడు అందులో రూ.18 కోట్లతో పనులు జరుగుతున్నాయి. నిర్వాసితుల దగ్గర తీసుకున్న ఇళ్లు, షాపులను తొలగించి నేలను చదును చేస్తున్నారు. ఈ ప్రక్రియ కాశీబుగ్గ రైల్వే గేటు నుంచి మూడు రోడ్ల కూడలి వరకు జరుగుతోంది.



ఇళ్లు, షాపులు నేలమట్టం చేస్తున్న దృశ్యం

అయితే ఇంకా కొంతమంది నిర్వాసితులకు నష్టపరిహారం అందాల్సి ఉందని, వాటిని కూడా త్వరగా తేల్చాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయంపై పలాస తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తిని వివరణ కోరగా మొత్తం 122 మంది నిర్వాసితులు ఉన్నారని.. అందులో అర్హులైనవారు 90 మంది అని ముందు తేలడంతో వారికి నష్టపరిహారం ఇచ్చామని, మిగతా వారికి కూడా పరిశీలించి ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

పలాస: ప్లాస్టిక్ లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలాస – కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పలాసలోని జీడి పిక్క బొమ్మ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు స్వచ్ఛత హీ సేవ ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ పరిసరాల అపరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, శానిటేషన్ సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని హోటల్ యజమానులు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. అక్టోబర్ 2 నుంచి ఎవరైనా ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జి ఉపేంద్ర, పర్యావరణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పలాస: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సోంపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ సూచించారు. సోంపేట మేజర్ పంచాయతీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కవిటి: ఆర్థిక సాయం అందజేస్తున్న శేఖర్

కవిటి: స్థానిక చింతామణి ఆలయ అర్చకుడు దివంగత జన్ని గోపాల్ కుటుంబానికి హనుమాన్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆపన్నహస్తం అందించారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పెద్ద మెళియాపుట్టుగలోని జన్ని గోపాల్ కుటుంబ సభ్యులను కలిసి రూ.12,500ల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. సంస్థ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ధికి చెందిన కె.మేఘనాథం కుటుంబానికి అండమాన్‌లో నివసిస్తున్న పలువురు మత్స్యకారులు రూ.2.48 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం ఈ మేరకు గ్రామపెద్ద ఆధ్వర్యంలో అండమాన్ వాసులు పంపించిన నగదును బాధిత కుటుంబానికి అందించారు. కె.మేఘనాథం కొద్ది నెలలుగా ప్రమాదంలో గాయపడి మంచం పట్టాడు. అత్యంత ఖరీదైన వైద్యం చేయాల్సి ఉందని వైద్యులు సూచించారు. దీంతో బాధితుడిని ఆదుకునేందుకు తమవంతు సాయాన్ని అందించారు.



కవిటి: మేఘనాథం కుటుంబానికి నగదు అందజేస్తున్న గ్రామ పెద్దలు

యూరియా సమస్యలు పరిష్కరించాలి

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల యూరియా సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూరియా కొరతతో రైతులు రోడ్ల వెంబడి తిరుగుతూ నరకయాతన పడుతున్నారని వాపోయారు. మండలంలో 12 వేల ఎకరాల వరి వ్యవసాయ భూమి ఉండగా, కేవలం 5,400 యూరియా బస్తాలను మాత్రమే అందించారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన మోతాదులో యూరియా సరఫరా చేయాలని కోరారు. వారితో పాటు మునకాల వీరాస్వామి ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ లోలాక్షి తదితరులు

డ్రైనేజీ అస్తవ్యస్తం..!

- అరకొరగా కాలువల నిర్మాణం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

పలాస:

వాణిజ్యపరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో చినుకుపడితే రోడ్లన్నీ చెరువులను తలపిస్తాయి. అపారిశుద్ధ్యంతో ప్రజలు అనునిత్యం నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపాలిటీ ఏర్పడి సుమారు 20 ఏళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ ప్రధాన రహదారుల్లో పాత మురికి కాలువలే దర్శనమిస్తున్నాయి. రోడ్లుకు ఇరువైపుల సరైన కాలువలు లేక ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. మున్సిపాలిటీలో 32.145 చ.కి విస్తీర్ణంలో 31 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 48 కిలోమీటర్లు మురికి కాలువలు ఉండాలి. అయితే పక్కా మురికి కాలువలు కేవలం 10 కిలోమీటర్లు మాత్రమే ఉన్నాయి. మరో 10 కిలోమీటర్లు కచ్చా డ్రెయిన్లు ఉన్నాయి. ముఖ్యంగా శివాజీ నగర్, సూదికొండ కాలనీ, రాజమ్మకాలనీ, శాంతినగర్, సూర్యకాలనీ, ఇందిరాకాలనీ తదితర ప్రాంతాల్లో నేటికీ పక్కా మురికి కాలువలు లేవు. తాత్కాలిక మురికి కాలువలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఏడాదికి మున్సిపాలిటీకి సుమారు రూ.1.5 కోట్ల ఆదాయం వస్తున్నా, పారిశుద్ధ్యం విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందువలన ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాశీబుగ్గ పాత జాతీయ రహదారి పక్కన మురికి కాలువ దుస్థితి (ఇన్‌సెట్లో) నర్సిపురంలో మురికి కాలువ దుస్థితి

మురికి కాలువ నిర్మించాలి



కాశీబుగ్గ ప్రధాన రహదారిలోని మేదర వీధి వద్ద మురికి కాలువను తక్షణమే నిర్మించాలి. ఎప్పుడో పాత కాలం నాటి మురికి కాలువ ఉంది. దానికి రెండు పక్కల గోడలు లేవు. ఆ పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉంది. కాలువలో నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డు మొత్తం జలమయం అవుతుంది. ఒక్కో సారి ప్రయాణికులు కాలువలోకి పడిపోతున్నారు.

– నిత్యానందపండా, 11వ వార్డు, కాశీబుగ్గ

నామమాత్రంగా పూడిక తీతలు



మున్సిపల్ అధికారులు మురికి కాలువల్లో పూడికల తీతల పేరుతో రూ.లక్షల్లో ఖర్చులు చూపిస్తున్నారు. కానీ పూడికలు పూర్తిస్థాయిలో తీయడం లేదు. శివాజీ నగర్, లేబరు కాలనీలో మురికి కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. పిచ్చిమొక్కలు కాలువలను కప్పేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు వీటిపై దృష్టి పెట్టాలి

– బమ్మిడి సంతోష్ కుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు, శివాజీనగర్

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని వజ్రపుకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఈనెల 20వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖా ఈఈ జి.యగ్నేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ లైన్‌లో ఉన్న చెట్లు కొమ్మల తొలగింపు కారణంగా వజ్రపుకొత్తూరు, పూండి, పాతటెక్కలి, బెండి, నగరంపల్లి, దేవునల్తాడ, మంచినీళ్లపేట తదితర గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల ఉంటుందన్నారు.

టెక్కలి: టెక్కలి సబ్‌స్టేషన్-1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ నరసింహకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నబజారులో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు మార్పు చేస్తుండడంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే బన్నువాడ ఫీడర్ పరిధి పితాపురం, నంబాళ్లపేట, అయోధ్యపురం, సోమయ్యవలస, కంట్రగడ, కూర్మనాథపురం తదితర గ్రామాల్లో పోర్టు రోడ్డు పనుల నేపథ్యంలో విద్యుత్ నిర్వాహణ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మందస: మండలంలోని హరిపురం, బాలిగాం, వీజీపురం, రఘునాథపురం, బీఎంపురం గ్రామంలో 11 కేవీ ఫీడర్ ఉద్దానం ఫీడర్‌కు ఆనుకుని ఉన్న చెట్లు తొలగించే నేపథ్యంలో శనివారం విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందన్నారు.

సోంపేట: మండలంలోని కొర్లాం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలియజేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్, అర్బన్ ప్రాంతం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం రూరల్ ఏరియా కేదారిపురం, ముచ్చింద్ర, ఈదుపురం, డొంకూరు, కేశుపురం, కొళిగాం, బిర్లంగి, తేలుకుంచి, హరిపురం, ఇచ్ఛాపురం పట్టణం పరిధిలోని బెల్లుపడ, బెల్లుపడ కాలనీ, కండ్రవీధి, గొల్లవీధి, వీకేపేట, రత్తకన్న, మండపల్లి, దాసన్నపేట, కస్పావీధి, పురుషోత్తపురం, డబ్బూరు వీధి, ఏఎస్‌పేటల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలన్నారు.